# క్రూరమృగం

**-వి. ప్రసాదరావు**

**ఆ ఊళ్లో వున్న ఆ ఒక్క లంకంత కొంప చుట్టూ వున్న ప్రహరీగోడ మీద నుంచి ఎత్తుగా పెరిగిన కొబ్బరిచెట్ల మధ్యలోంచి ఎరుపెక్కిన కళ్లతో చూస్తున్నాడు సూర్యుడు.**

ఆ సాయంత్రంవేళ ఎప్పటిలా నల్లఇరుగుడు వాలు కుర్చీలో కాళ్లు బారచాపి కూర్చుని చుట్ట తాగుతూ ఊళ్లో వాళ్ల కోడి తగవుల నుంచీ, కోడళ్ల తగవులదాకా అన్నీ తీర్చేందుకు కొలువు తీరాడు వీరయ్య దొర. ఆ ఊళ్లో వాళ్లందరికీ వీరయ్య దొర కొంపే న్యాయస్థానం, లా అండ్ ఆర్డర్ చూసే హౌసున్నూ. వీరయ్య దొరే ఆ ఊరికి ప్రెసిడెంట్ కనుక ఆ కొంపే అందరికీ అధ్యక్ష భవనం!

''దొరా...దొరా...దొరా...''

కొన్ని పదుల గొంతుకలు-వందలసార్లు అరుచుకుంటూ రాసాగాయి భవనం గేటు తోసుకుని లోపలకు.

''ఏంట్రా కేకలు...'' తాగబోతున్న చుట్టను నోట్లోంచి తీసి అడిగాడు దొర.

దొర కాళ్లొత్తుతున్న కామేశు కాస్సేపు ఆ పని ఆపి ఓ క్షణం అటువేపు చూశాడు. దొర పక్కనే వుండి దొర కను సైగ చేస్తే కదిలేందుకు సదా సిద్ధంగా వుండే భీముడు దొర సైగ లేకుండానే కదిలాడు వాళ్లను అడ్డుకునేందుకు. భీముడ్ని నెట్టుకుంటూ దొర దగ్గరకొచ్చేశారు వాళ్లు.

''దొరా...దొరా...'' వగరుస్తూనే ఉన్నాయి గొంతుకలు.

''ఏమయిందిరా?'' అడిగాడు దొర.

''దొరా! వచ్చేసినాద్దొరా మళ్లీ వచ్చేసినాద్దొరా...''

''దొరా... తమరు దాన్సంగతి సూడకుంటే మాయందర్నీ తినేస్తాద్దొరా'' భీముడికి పరిస్థితి అర్థమైంది. ఇక అడ్డగించడం మానేశాడు.

''ఊ... అప్పుడే అనుకున్నారా వస్తాదని...'' దొర చుట్టని నోట్లో పెట్టి బలంగా పీల్చాడు! పీల్చి వెనక్కివాలాడు.

''అవుందొరా. అది ఓపాలి దెబ్బ తినీసి పోయింది కద దొరా. పగబట్టినట్టొచ్చీసింది. వొచ్చీసి ఊరుమీద పడ్డాద్దొరా...''

దొర చుట్టని బాగా పీల్చి కింద పడేశాడు. కామేశం దాన్ని నేలకు అదిమి పింగాణి ఏష్ట్రేలో పడేశాడు.

''సర్లే ఎల్లండి. దాన్సంగతి నేను రెండ్రోజుల్లో చూసుకుంటా. ఎల్లండ్రా' అని వాలుకుర్చీలో మరింత వాలుగా చేరబడ్డాడు దొర. చేరబడుతూనే ఎడమకాలిని కామేశు భుజానికి బలంగా తాటించాడు. తూలిపడబోయిన కామేశు తెప్పరిల్లి జనం మీది దృష్టిని మళ్లీ కాళ్లమీదకు సారించి తన పనిలో పడ్డాడు.

దొరకు తామొచ్చిన సంగతీ, తమ భయమూ, తమ కోరిక దానిపై దొర స్పందన అన్నీ తెలిశాయి కనుక వచ్చిన పనయిపోయిందన్న భరోసాతో వెనుతిరిగాయి గొంతుకలు.

''దొరా! తమరు దరమరాజులు. మా గొడ్లునీ, జీవాల్నీ తవరే కాపాడాల... మా ప్రేనాలన్నీ తవరే కాపాడాల దొరా...'' విన్నవించుకుంటూ నిష్క్రమించాయి గొంతుకలన్నీ.

కళ్లకి చీకటి పొర కమ్మిన సూర్యుడు కిందికి దిగిపోయాడు!

★★★

చింతాకుపాలెం చిన్న గ్రామం. దాన్నానుకుని వుంది గూబలకోన. వెదురుపొదలు, నాగజెముళ్లు, ఇరుగుడు మానులు, ఎర్రచీమల పుట్టలు ఆ కోన ఆస్తులు. కణుజులు, దుప్పులు, వాటిని తినే దుమ్మలగొండ్లూ, ఎలుగ్గొడ్లూ ఆ కోన జీవాలు. ఓ రోజున ఎలా వచ్చిందో ఏమో ఓ చిరుత కోనకొచ్చిపడింది. పెద్ద బంజరు రిజర్వు ఫారెస్టులోంచి తప్పించుకొచ్చేసింది కాబోలని అంతా అనుకున్నారు. ఆ వచ్చిన చిరుత మొదటగా గూబలకోన దరిదాపుల్లో మేకల్ని మేపుకునే దుబ్బుగాడికి దర్శనమిచ్చింది. వాడు మేకల్ని వదిలేసి పరుగెత్తిపారిపోయాడు. మేకలు మేమేలతో వాడి వెనుక పడ్డాయి. ఆ సమయం ఆ ఊరి మనుషులు చద్దన్నం తినేవేళ. పులికి రాత్రి తిన్న కణుజు అరిగి జీర్ణమయినట్లుగా లేదు కాబోలు. ఆ ఉదయపు మేతల జోలికి పోలేదు. మేకల్నీ, మేమేల్నీ చూస్తూ వింటూ ఉండిపోయింది.

దుబ్బుగాడు ఊళ్లోకి ఎగురుకుంటూవచ్చి రచ్చబండ దగ్గర ఎండకాగుతున్న వారి దగ్గర వాలాడు పులి...పులంటూ! అంతే! కుండపెంకుల్లా చెదిరిపోయారంతా. పులిగానీ, దాని అరుపుగానీ, కనీసం వాసనగానీ తమను పరామర్శించకపోవడంతో పెంకులన్నీ రచ్చబండ దగ్గర పోగయ్యాయి.

''పులి...పులి అని బెదరగొటీసినావుకదరా పిరికినాకొడకా. ఏదిరా పులి?'' అందరిలోనూ భయం లేకుండా వున్న కామేశు అడిగాడు.

''అదేవన్నా సెవలపిల్లేంట్రా సాచ్చికంగా తెచ్చి దాన్ని నీకు సూపించడానికి'' దుబ్బుగాడు కసురుకున్నాడు.

''అదా పారెస్టులో నుంచి వచ్చీసిందిగావాల'' ఒకతను దుబ్బుగాడిని సమర్థించాడు.

''ఒరేయ్! ఆ పారెస్టోల్లకి కబురు సేయించాల్రా'' సలహా ఇచ్చాడు మరొకడు.

''సాల్లే... ఆల్లొచ్చి దాన్ని సంపకూడదంటారు. అదిమన్నీ, మన గొడ్డాగోదల్నీ సంపినా దాన్ని మనం సంపకూడదంట...''

''ఏం?'' పదేళ్ల కుర్రాడడిగాడు తెలీక.

''వొన్యముగాల్ని రచ్చించే రూలు కింద సంపకూడదంట్రా...'' చెప్పి సందేహం తీర్చబోయాడు ఇంకొకడు.

''మరయితే మాంసాలికీ, సెర్మాలకీ దుప్పుల్నీ, కణుజుల్నీ సంపీయొచ్చా.. ఆట్ని రచ్చించే రూలుసులు లేవా?'' వాడే అడిగాడు.

''నోర్ముయ్‌రా బక్కనాకొడకా. దుప్పులు, దూడలు లెక్కా జమా? పులంటే పులేరా?''

''ఏం పులయితే ఏం?'' కామేశు అడ్డు తగిలాడు.

''నోర్ముయ్యేస్! నువ్వూ ఉన్నావు నక్కలాగ. నీలాంటోళ్లు కోట్లుంటారు. పులి సూడు మన దొరలాగ దరిజాగా కోటికీ నూటికీ ఒక్కటుంటాది. అందుకే పారెస్టోల్లకి అదంటే ప్రేమ!''

''ఈ గుంటలికి సెప్పడం సాలుగానీ ఇప్పుడేం సేద్దామంటారు?'' ఓ ముసలాయన పులి సమస్యను అందరి ముందూ వుంచాడు.

''మొన్నోసారి ఎలుగ్గొడ్డొచ్చి మా ఎంకటిగాడి సెయ్యి కొరికేసి వూళ్లోని మూడు గొడ్లునీ వర్సగా ఈడ్చుకుపోయిందని ఈ పారెస్టోల్లకి కబురెడితే వచ్చారా సచ్చారా. సివరికి ఈరయ్యదొరే గతయ్యాడుకదా...'' అన్నాడొకడు.

ఎందుకో అందరూ పులి ఆ సమయాన ప్రత్యక్షమైనట్లుగా ఉలిక్కిపడ్డారు. పులికన్నా వీరయ్య అంటేనే భయం అన్న భావం అందరిలోనూ కదలాడింది.

వీరయ్య దొరకు డబ్బుంది. రాజకీయ పలుకుబడి వుంది.

గుహలాంటి బంగళా వుంది. పంజాల్లాంటి కళ్లున్నయ్...ఎరల్లాంటి మనుషులున్నారు. అడవిలాంటి పల్లె వుంది. అతను గట్టిగా అరిస్తే పులే అరిచినట్లుగా వుంటుంది.


అది అందరికీ గుర్తుచేసే దానికన్నట్లుగా ఒకడన్నాడు.

''ఒరేయ్! ఆ పులిని కొట్టాలంటే ఈ ఈరయ్య పులే కదలాల్రా అని!''

మరోవారంలోగా వాడి మాటే నిజమయింది. పులి వీరయ్య కదిలాడు. ఆ వారంలోనే రామయ్య మేకనీ

చంద్రయ్య బర్రెనీ పొట్టన పెట్టుకున్న పులిని వేటాడేందుకు భీముడూ కామేశు అంతా వెంటరాగా!

అడవంతా గాలించారు. పులిజాడల్నీ, అది తిరిగే మార్గాన్నీ పరిశీలించి వేటకు అనువైన స్థలం ఎంచుకున్నారు. అక్కడ ఉదయమే ఓ ఎత్తయిన చెట్టుమీద మంచెకట్టి మాటు ఏర్పాటు చేసి పెట్టాడు భీముడు. కాస్తంత దూరాన మరో చెట్టుకు ఎరమేకను కట్టి వుంచాడు. వేటకు రంగం సిద్ధం అయింది. అర్ధరాత్రి కావస్తుండగా పులి అలికిడి కాగా ఎర కట్టిన చెట్టుకు సమీపాన మరో చెట్టుపైవున్న భీముడు ఈల వేసాడు. దొర పక్కనే వున్న కామేశు టార్చిలైట్ వేశాడు. ఆ వెంటనే దొర గురిచూసి పేల్చాడు. అలా రెండుసార్లు పేల్చాడు. పులిని రాచుకుంటూ పోయినాయి తూటాలు. గాయపడ్డ పులి మళ్లీ వస్తుందేమో అని ఆ రాత్రంతా చూసారు. దాని జాడ లేదు. తెల్లవారుతుండగా వెనుతిరిగి వెళ్లారు. అది మళ్లీ ఏ రోజయినా రావచ్చుననీ, వచ్చి గ్రామంపై పడొచ్చుననీ అనుకున్నారు. అందరూ అనుకున్నట్లు ఆ రోజు రానే వచ్చింది.



మళ్లీ వేటకు అంతా సిద్ధమయింది. శత్రు శేషం లేకుండా చేసేందుకు రంగం సిద్ధమైపోయింది. ఈసారి మాటు మార్చారు. ఎర దుబ్బుగాడి మందలోని మేక! భీముడు ఎరకట్టిన చెట్టుకు దగ్గరగా మరో చెట్టుపైన! దొర ఎత్తయిన చెట్టుపైన మెత్తని దిండ్లు వేసిన మంచె మీద! దొర కాళ్ల దగ్గర టార్చిలైట్‌తో కామేశు.


భీముడు ఏ చిన్న అలికిడయినా ఓ రకమైన సంకేత శబ్దం చేస్తున్నాడు. అది పులికాదని! పులి అయితే ఆగి ఆగి మూడుసార్లు సన్నగా ఈల వేస్తాడు. ఈల ఆగాక కామేశు టార్చి వెలిగిస్తాడు. వేట మొదలవుతుంది.

అర్ధరాత్రి కావస్తోంది. కామేశు గుండె ఇంజన్‌లా శబ్దం చేస్తోంది. వేట...వేట! అతని చెవుల్లో మార్మోగుతున్న శబ్దానికి నరాలు...కరాలు అన్నీ టెన్షన్‌లోనికి వచ్చేసినయ్! ఓ క్రూరమృగం వేటలో ఎంత థ్రిల్ వుంటుందో తలచుకున్నకొద్దీ అతని పెదాలపై కనబడని మందహాసం మెరుస్తోంది. ఆ క్షణం కోసం క్షణక్షణం టెన్షనే!

అంతలో సన్నగా ఈల! ఆగి ఆగి మూడుసార్లు. మేక అరుపులో ప్రాణభయ రాగం.

''ఒరేయ్!'' దొర కాళ్లతో మెత్తగా పిలిచాడు. కామేశు టార్చిని వెలిగించాడు. కొద్ది దూరాన పులి. ఆ కళ్లల్లో ఆకలి, ప్రతీకారం, పగ స్పష్టంగా చూసాడు. అది తమకేసే వస్తోంది. దొర తుపాకీని పొజిషన్లోకి తెస్తున్నాడు. అదే సమయాన తన కుడికాలును పొజిషన్లోకి తెస్తున్న కామేశు ఊపిరి బిగపట్టాడు. ఇక తుపాకీ పేలడమే తరువాయి. క్షణాలు కదలడం మానేసిన ఆ క్షణం దబ్‌మన్న




చప్పుడు- ఆ క్షణం కదులుతుండగానే ''భీముడూ'' అన్న గుండెల్ని చీల్చుకొచ్చిన కేక, ఆ వెనుకనే పులి చేసిన విజయగర్జన... అన్నీ తరంగాల్లా కదిలిపోయి నాయి. తుపాకీ పేలకుండానే క్రిందపడింది. టార్చిలైటు పట్టుజారి మరోవైపు పడింది. పడినా చీకటిని చీలు స్తోంది.

దొర ఆర్తనాదం రెండోసారి దిగంతాలకు పోతుండగా నమ్మినబంటు భీముడూ ఉరికాడు. పులీ ఉరికింది. భీముడి మెడ కొరికి మరో మనిషి వేడి రక్తం రుచి చూసింది. అదే క్షణం భీముడి పెనుకేక ఎగసి దిగంతాలకు పోయింది ఇందాకటి ప్రాణంతో పాటు. రెండే రెండు నిముషాల పాటు పులి వేటకాదు మనిషి వేట ఎలా వుంటుందో ప్రత్యక్షంగా చూసిన కామేశుకు భయం అన్నది పూర్తిగా పోయింది.

కొద్ది క్షణాల తర్వాత పులి అక్కడ్నుంచి రెండు కళేబరాల్ని ఈడ్చుకుపోయింది. కామేశు చెట్టును దిగాడు. టార్చిని తీసుకు న్నాడు. ఎరను విప్పి తాడును చేతి లోనికి తీసుకున్నాడు. మూగజీవం వెంటరాగా కదిలాడు.

పద్దెనిమిదేళ్ల కామేశుకు ఆరేళ్ల కామేశు కన్పిస్తున్నాడు. తన తండ్రీ తాత అందరూ దొరల దగ్గర పాలేర్లు. దొర తోటలో ఓ మూలకు గుడిసె వేసుకుని వుండే వాళ్లు. తన తల్లి అందమైనదేకాక అమాయకమైనదట. ఆ రెండే దొరకు అమ్మని బలి చేశాయట.

ఓ రోజు తోటకొచ్చిన దొర తన గుడిసెలో దూరాడు. బయట ఆడుకుంటున్న తను కాస్సేపటికి అమ్మ వేసిన కేకలకు లోపలికి వెళ్లాడు. అమ్మా...దొర పెనుగులాడుతున్నారు. ''కామేశూ... అయ్యని పిల్చుకురా'' అమ్మ గుండెని చీల్చుకొచ్చిన ఆ మాటనే అమ్మ చివరి మాటగా విన్నాడు. విని బయటకు పరుగుతీసాడు. అయ్య ఊళ్లో లేడు. దొర చెప్పిన పనిమీద పట్నమెళ్లాడు. అయ్య వచ్చేసరికి అమ్మ శవం నూతి అడుగున ఉంది. అయ్య ఏడ్చాడు. ఏడుస్తూనే దొర దగ్గరకు వెళ్లాడు. మరో రెండురోజులకు అయ్యను ఎలుగ్గొడ్డు చంపి తినేసాయని అంతా చెప్పుకు న్నారు.

''మీ అయ్యనీ, అమ్మనీ దొరే చంపేసాడురా'' అని రహస్యంగా చెప్పిన తాత కూడా కొన్నాళ్లకు చనిపో యాడు. అందర్నీ పోగొట్టుకున్న తనని దొర తీసుకుపో యాడు. బండ చాకిరీకి గుప్పెడు మెతుకులేసి పెంచాడు బానిసగా! కట్టు బానిసలా తీర్చిదిద్దాడు.

నేటికి...పన్నెండేళ్లకి తన తపన ఫలించింది. తన గుండె మంట చల్లారింది. అమ్మ మనసూ, అయ్య మనసూ శాంతిస్తాయి. ఇప్పుడు తనకూ స్వేచ్ఛ వచ్చింది.

స్వేచ్ఛ...! తనిప్పుడెవ్వరికీ కాళ్లు వత్తడు. తల వంచడు.

''అడవిలోని క్రూరమృగాలు ఊళ్లమీద పడితే సంపడానికి పోలీ సులున్నారు, దొర్లాటోల్లున్నారు. కానీ వూర్లోని క్రూరముగాల్ని సంపడానికెవరున్నారయ్యా?'' అంటూ తనని గుండెలకు హత్తు కుని ఏడ్చిన తాత గుర్తుకొచ్చాడు. ఆ తాతకు మనసులోనే దండం పెట్టుకుని బలంగా ఊపిరి పీల్చు కున్నాడు.

టార్చిలైట్ దారి చూపుతుం డగా కదులుతున్న కామేశు అక్కడ చీలిన రెండుబాటల నడుమ ఆగి మూగజీవం మెడ బంధం తొలగించి దూరంగా పారే సాడు. మూగజీవం అలవాటున పల్లెదారిని పట్టింది. కామేశు స్టేషన్ దారిని పట్టాడు.

తూరుపు తెల్లవారుతుండగా రైలుబండి ఎక్కాడు. అతని దగ్గర ఓ గమ్యాన్ని చేర్చే టిక్కెట్టులేదు. కానీ అతనికి రెక్కలున్నాయ్! వాటిలో బలముంది! ★



## మాధురి ఆశ!

ఒకప్పుడు శ్రీదేవితో 'నంబర్ వన్' రేస్‌లో నెక్ టు నెక్‌గా పోటీపడి అగ్రశ్రేణి హీరోయిన్‌గా రాణిస్తూ వచ్చిన మాధురీ దీక్షిత్‌కి దాదాపు రెండేళ్లుగా చెప్పుకోదగిన హిట్టు ఒక్కటీ లేదు. 'దిల్‌తో పాగల్ హై' హిట్టయినా కూడా అందులో కరిష్మా కపూర్‌కే ఎక్కువ మార్కులు లభిం చాయి. ప్రస్తుతం అర్జంట్‌గా ఓ హిట్ కోసం ఎదురు చూస్తోంది మాధురి. రాబోయే ఆమె సినిమాల్లో 'ఆర్జూ' బోల్డు పేరు తీసుకొస్తుందనే ఆశతో వుందట. ఈ సినిమా ఖచ్చితంగా తన కెరీర్‌ని కొత్త మలుపు తిప్పుతుందని కని పించిన వాళ్లందరికీ చెబుం తోందిట మాధురి. ఇది కాకుండా ఎం.ఎఫ్.హుసేన్ తీస్తున్న 'గజగామిని' కూడా మాధురీ కెరీర్‌కి బూస్టనివ్వచ్చని ఆశిస్తోంది.

-జె.ఎం.